# "పరివర్తన"

* రచన: శ్రీ బుద్ధిరాజు నరసింహారావు *



(రచయిత)

"చూడు భానూ....నీతో వాదన పెట్టుకోవడం నాకిష్టం లేదు .. ప్లీజ్....నాకు బోలెడంత పని ఉంది. రేపు వర్కర్స్ పేమెంట్ డే.... రాత్రంతా కూర్చుని ఆ బిల్స్ పూర్తి చేయాలి." బాలు విసుక్కుంటూ అన్నాడు.

భాను నుదురుపై మడతలు పడ్డాయి. కోపోద్రేకాలతో హృదయం భగ్గుమంది. "నేనా వాదిస్తున్నది?....అవును తప్పంతా నాదే....ఎల్లుండి నా మిత్రురాలి పెళ్ళి....ఆమెకి ఓ మంచి ప్రెజెంటేషన్ యివ్వాలి....రెండువందల రూపాయలు అడగటం పెద్ద నేరమై పోయిందేం?"

"భానూ .. నీ వద్ద దాచవలసిన అవుసరం నాకేం లేదు. నన్నెందు కిలా వేధిస్తావు....అందిన జీతం ఏనాడో ఖర్చు అయిపోయింది. జబ్బుతో మంచం పట్టిన నాన్నగార్ని అన్నయ్య విశాఖపట్నం తీసుకెళ్దా మనుకుంటున్నాడు....అన్నయ్యకి ఓ రెండు వందలు పంపుదా మనుకున్నాను....కాని సాధ్య పడలేదు...."

"ఓహో....ఎంత మాట .. పంపించండి....రెండు వందలేం ఖర్మ....వేయి రూపాయిలు పంపించండి....నా గురించి మీకేం బాధ?....రేపు పది మందిలో లత నన్ను నిలదీసి అడుగుతే నా పరువు ప్రతిష్ఠలే కదా గంగలో కలిసేది....మీకేం....మొగ మహారాజులు...."

"అబ్బబ్బ....భామా....ఏమిటా పిచ్చి వాదన....నువ్వు నన్నెందుకు అర్థం చేసుకోవు?"

"బాగా అర్థం చేసుకున్నాను, ఇంకేమీ అర్థం చేసుకోక పోతేనే మంచిది!"

"భానూ! మనిద్దరమే కాదు ...మనకి జానీ ఉన్నాడు పాప ఉంది....వారి చదువుకీ, బట్టలకీ అయ్యే ఖర్చే కాకుండా, వారి భవిష్యత్తు కొరకు నేను బ్యాంకులో రెండు వందల రూపాయల రెకరింగ్ డిపాజిట్టు చేస్తున్నాను. జీతంలో అన్ని కటింగ్స్ పోగా చేతికి మిగిలేది అయిదు వందలు. శాంతంగా ఆలోచించు. అందులోనే ఎలాగో మనం యింటి ఖర్చులు మేనేజ్ చేస్తున్నాము." బాలు ఆమెకి నచ్చజెప్తూ అన్నాడు.

"నాకు మీతో వాదించడం అనవసరం. నా మాటకి సూటిగా జవాబు చెప్పండి....నాకు రెండువందలు యిస్తారా లేదా?" భాను కఠోరంగా అంది.

బాలు కొద్ది క్షణాలు ఆమెనే తదేకంగా చూశాడు. అతను ఆమె మనోభావాలని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు. కాని అతనికి అంతు పట్టలేదు.

"నా ప్రశ్నకి చివరి సారిగా బదులు చెప్పండి!"

బాలు విచలితుడైనాడు. భామకి ఎలా నచ్చజెప్పాలో అర్థం కావడం లేదు.

ఆమె పరిస్థితులను ఎందుకు గ్రహించదు? ఎందుకామె రోజు రోజుకి అలా మారిపోతున్నది? ఆమెలో వస్తున్న ఈ పరివర్తనకి కారణం ఏమిటి?

బాలు కుర్చీలోంచి లేచి కిటికీ వద్ద నిలబడ్డాడు.

"అది వీలుపడదు భానూ!" బాలు కొంత గంభీర స్వరంతో అన్నాడు - "నేను యిదివరకు కూడా నీతో ఎన్నోసార్లు చెప్పాను. లోకానికి మన మేదో ధనవంతుల మని, గొప్ప వాళ్ళమని చూపించుకుని లాభమేమిటి?

మనమేం గొప్ప వాళ్ళం కాదు....మధ్యతరగతి బ్రతుకులు మనవి. అందుకు మన ఖర్చులు ఎన్నడూ హద్దు మీర కూడదు. ఇంతకు క్రితం ప్రతి నెలా నువ్వేదో పార్టీ అనో, ఫ్రెండ్స్‌కి గిఫ్ట్స్ యివ్వాలనో, మహిళా సభల చందా అనో ఎంతో కొంత ఖర్చు చేస్తూనే ఉన్నావు.... నేను కాదనలేదు. కాని ఈ మాటు నాన్నగారు అటువంటి పరిస్థితులలో ఉన్నారు....ఆయన ట్రీట్‌మెంటు కోసం డబ్బు పంపడం, నీ ఫ్రెండు పార్టీ కన్నా ముఖ్యం కదా!''

''సరే లెండి అసలు మీ ముందు చేయిజాపి అడగడమే నా పొరపాటు. నాకసలు బుద్ధి లేదు. ఆనాడు మీ కోరిక కాదనక వెర్రిదానిలా చక్కటి ఉద్యోగం మానుకున్నాను.''

''భానూ! నా మాట విను....''

''ఇంక నన్ను ఫూల్ చేసే ప్రయత్నం మానుకోండి.'' కోపంలో చిందులు త్రొక్కుతూ భాను తన గదిలోకి వెళ్ళి దభాలున తలుపులు వేసుకుంది.

బాలు కొద్ది క్షణాలు తదేకంగా మూసుకుని ఉన్న తలుపుల వంకే చూసి మెల్లిగా నిట్టూర్పు విడిచి కుర్చీపై కూర్చున్నాడు.

* * *

ఆ రోజు నించి భానులో విపరీతమైన మార్పు వచ్చింది. ఆమె పూర్తిగా మారిపోయింది. మాటి మాటికీ జానీని, పాపనీ కసిరి కొట్టేది.

బాలు ఎన్నోసార్లు కలుగజేసుకున్నాడు. ''భానూ! నా మీద కోపం నా మీదే చూపు గానీ, అశం-శుభం తెలియని పసికందులని ఎందుకలా వేధిస్తావు....అలా చేస్తే వారి పసి హృదయాలపై ఎన్నడూ చెరగని ముద్రలు పడిపోతాయి....''

భాను ఎటువంటి జవాబు చెప్పేది కాదు. ఆమె మౌనభంగము చూసి బాలు హృదయంలో ముల్లు గుచ్చుకున్నట్లయ్యేది.

అప్పుడప్పుడు బాలుకి పదేళ్ళ క్రితం రోజులు గుర్తుకి వచ్చి బాధ పెట్టేది.

ఆ రోజులు ఎంత మధురమైనవి!

భానుతో తన పెళ్ళి జరిగేటప్పటికి తను హెచ్. ఏ. ఎల్. లో క్యాషియర్‌గా పని చేసేవాడు. భాను అక్కడే టైపిస్టుగా పని చేసేది.

జానీ పుట్టిన తర్వాత బాలు ఆమెతో అన్నాడు - ''భానూ....ఇక నువ్వు ఉద్యోగం మానేస్తేనే మంచిదని నా అభిప్రాయం! మనిద్దరం .... జానీ ఒక్కడూ .. నా జీతంతో చక్కగా మేనేజ్ చేసుకోవచ్చు....మనిద్దరం పనిలోకి వెళ్ళిపోతే జానీని ఏ పని మనిషికో అప్పజెప్పడం నా కిష్టం లేదు....నీ అభిప్రాయమేమిటి?''

''మీ మాట ఎప్పుడైనా కాదన్నానా?'' భాను ప్రేమగా అతనివైపు చూస్తూ అంది.

''నిజంగా భానూ! నీ లాంటి మంచిదాన్ని పొందడం నా అదృష్టమే కదా!'' బాలు ఆమె ముంగురులు సవరిస్తూ ఆప్యాయంగా అన్నాడు.


Estd. 1957 Phone: 373



ఎల్లప్పుడూ ....

మా ప్రసిద్ధి చెందిన

* జంకాళాలు, * బెడ్ షీట్లనే

ఉపయోగించండి.

ఆంధ్రప్రదేశంలో, మా ప్రతినిధిగా చేరుటకు సమర్థులైనవారి నుంచి

ధరకాస్తు కోరబడుచున్నాము.

: తయారించువారు :

**Rainbow Industrials**

P. B. No. 261 : : BHAVANI - 638 302.

'చాల్లెండి....నన్నంతగా పొగడకండి;' అన్నట్లు మాటల్లో పడి మీకు కాఫీ యివ్వనే లేదు.'' భాను చిలిపిగా నవ్వుతూ వంటింటి వైపు వెళ్ళిపోయింది.

ఆ రోజులు తలచుకుని బాలు కళ్ళు చెమ్మగిల్లాయి. నిజంగా ఆ క్షణాలు ఎంత అమూల్యమైనవి? కాని ఆనాటి భాను ఈరోజు ఎంతలా మారిపోయింది?

* * *

భానుకి ఎంత ప్రయత్నించినా నిదుర రావడం లేదు. రెప్పలు మూసుకుంటే చాలు - బాలు రూపం ఎదురుగా ప్రత్యక్షమై ఆమెని ఉద్రేక పరుస్తోంది....ఆమె హృదయం భగ్గుమంటోంది.

''హుం....బాలుకి నేనంటే ఎవరో తెలియదు. నేనేదో పెద్ద నేరం చేస్తున్నట్లు నాపై అధికారం చలాయిస్తున్నాడు....''

భానులో అహం తలెత్తింది. ఆమె ఏదో దృఢంగా నిశ్చయించుకుంది.

తెల్లవారింది ...

ఏడు గంటలకి ప్రతిరోజు లాగే బాలు రెడీ అయి ఆఫీసుకి బయలుదేరాడు.


''వెళ్ళొస్తాను, భానూ!''

''టేబిలుమీద టిపిను ఉంది.''

భాను ఎలాగో అవి గదిలోకి వెళ్ళిపోయింది. మౌనంగా పత్రిక పేజీలు తిరగెయ్యడం మొదలు పెట్టింది.

బాలు వెళ్ళిపోయి నట్లున్నాడు. ఎటువంటి అలికిడీ లేదు....

భాను మెల్లిగా లేచి ముందు గదిలోకి వచ్చింది. టేబిలు మీద టిఫిన్ ఎలా వుందో అలానే ఉంది. అంటే బాలు టిఫిన్ చేయకుండానే వెళ్ళిపోయాడన్న మాట!''



బాను హృదయం చివుక్కుమంది, అప్రయత్నంగానే ఆమె కళ్ళల్లో నీరు నిండుకుంది. ఆ రోజులు ...ఆ రోజులు ఎంత ముచ్చటైనవి....తనూ, బాలూ కలిసి టిఫిన్, కాఫీ ముగించేవారు. తను బాలుని బయటకు సాగనంపేది. బాలు వెళ్ళేముందు తనని దగ్గరగా తీసుకుని ప్రేమగా ముద్దు పెట్టుకుని నవ్వుతూ వెళ్ళేవాడు.

కాని ఇక ఆ రోజులు లేవు....ఆ బాలు కూడా కాడు ... బాలు మారి పోయాడు....ఇద్దరిమధ్యా పెరిగిన అగాధం వారిని దూరంగా నెట్టింది.

* * *

"బాబాయీ! నేను నిజం చెప్తున్నాను .. ఇక ఆయనతో కలిసి ఉండటం నా వల్ల కాదు. అందుకే నేను మళ్లా ఉద్యోగానికి ఎప్లైయ్ చేశాను....మీరు నన్నర్థం చేసుకుని నాకు సహాయ పడతారని మీ వద్దకు వచ్చాను. నన్ను నిరాశ పరచకండి....నేను ఆయనకు విడాకు లివ్వదలిచాను."

వయసులో, అనుభవంలో బాగా పండిపోయిన ప్లీడర్ సుబ్బయ్య ఆశ్చర్యంగా ఆమె వైపు చూశాడు.


"అమ్మాయీ! నేను నీ పొరిగింటి వాణ్ణే కాదు - నీ మేలు కోరేవాడిని కూడా! నీతో రక్తసంబంధం లేదుకాని ఎప్పుడూ నిన్ను నా కూతురుగా భావిస్తున్నాను. అందుకే నీకు నచ్చచెప్తున్నాను. ఆవేశంలో తొందరపడి అంత కఠోరమైన నిర్ణయం తీసుకోగూడదు. వైవాహిక సంబంధాలని తెంచుకునే ముందు శాంతంగా ఆలోచించుకోవాలి. నీవే కాదు, నీతో యిద్దరు పిల్లలున్నారు. వారి భవిష్యత్తు మీ యిద్దరిపై ఆధారపడి వుంది. ఇలాంటి పరిస్థితులలో నువ్వు తెగతెంపులు చేసుకుంటే అది నీ మూర్ఖత్వమే అవుతుంది. చూడమ్మాయీ! భార్యాభర్తల మధ్య ఏవో చిన్న చిన్న మనస్పర్థలు వస్తూనే ఉంటాయి. వాటిని మీరిద్దరూ సరిదిద్దుకోవాలి. అసలు యిలాంటి చిన్న చిన్న మనస్పర్థల తర్వాత కలయికలో జీవితం ఆనందంగా వుంటుంది. ఇద్దరిమధ్యా ప్రేమ అభివృద్ధి చెందుతుంది. ఒకరి నొకరు అర్థం చేసుకుని మసలుకోవాలి, అంతేగాని అంత దృఢమైన నిశ్చయం ఎన్నడూ చేసుకోగూడదు."

"మీకు తెలియదు బాబాయీ! ఇక నా ఓపిక నశించిపోయింది. పెళ్ళయిన తర్వాత అన్ని విషయాల్లో నేనే తగ్గవలసి వస్తోంది. 'మా అమ్మ హైద్రాబాదులో ఉంది. అక్కడికి ఓసారి వెళ్ళి వస్తావంటే తారాజువ్వలా లేస్తారు. ఖర్చులు లెక్క వేస్తారు. బోలెడు ఖర్చు అవుతుంది ... వచ్చే సంవత్సరం వెళ్దాములే.' ఎప్పుడైనా డబ్బున్నప్పుడు కొట్టుకెళ్ళి ఓ మంచి చీర తెచ్చుకుంటే, రెండు నెలలే కదా అయింది ఆ చీర తెచ్చి....అది యింకా పెట్టెలోనే ఉంది. ఎందుకలా డబ్బు వేస్టు చేస్తావు.' పిల్లల బట్టలు కొంటే పెద్ద లెక్చరు....పోనీ గాజులు కొనుక్కుంటే విసుగుదల. మిత్రురాలి పెళ్ళికి ఏమైనా యిద్దామంటే పెద్ద రభస....వెర్రి వాదన....ఎంతకని సహించేది? నేనూ ఓ ఆడదాన్నే....నాకూ కొన్ని కోరికలుంటాయని గ్రహించలేని భర్తతో ఎంతకాలం గడప గలను?"

"అంతేకదా! అదేం పెద్ద సమస్య కాదుగా? ఏం బాలు అనే దాంట్లో తప్పుందా? శాంతంగా ఆలోచించమ్మా! అతను ఏమి చేసినా నీ కోసం, నీ పిల్లల కోసమే కదా! చూడమ్మాయీ! ప్రతి మనిషి స్వభావం వేరు వేరుగా ఉంటుంది. పోనీ నీకేదైనా కొనాలనుంటే ముందుగానే యిద్దరూ కలిసి బాగా ఆలోచించుకోండి.... జీతం అందగానే ముఖ్యమైన ఖర్చులని వదలి, అవసరమైనవి ఓ బడ్జటు తయారు చేసుకుని ఖర్చు పెట్టుకుంటే మీ సమస్యకు పరిష్కారం కుదురుతుంది కదా!" సుబ్బయ్య ఆమెకి నచ్చచెప్ప చూశాడు.

"అది ఎన్నటికీ సాధ్యపడదు, బాబాయీ! ఆ మనిషితో కాపురం చేయడం నా వల్ల కాదు. ఇక నేను సహించలేను.

ఫోన్ నెం.: 21386



Saradha
—KNITTING MILLS—
TIRUPUR - 638 602.

నాకెలాగైనా విడాకు లిప్పించండి !'' భాను స్వరం అపలిక ఏమీ వినిపించుకునేటట్టు లేదు.

ఏళ్ళ తరబడి అనుభవమున్న సుబ్బయ్య ఆమె భావోన్మాది అని, ఆమెది వెర్రి ఆవేశమని పసిగట్టాడు. భాను లాంటి వారికి ఎంతో ప్రేమగా మంచి దారి చూపించాలని. లేకపోతే వారు భయంకరమైన నిర్ణయాలు తీసుకుంటారని సుబ్బయ్యకు బాగా తెలుసు. అందుకే, "సరేనమ్మా, నీ మాట కాదనను. కాని నాదో షరతు. ముందు నేనుకూడా బాలుకి నచ్చజెప్పి చూస్తాను.'' అన్నాడు.

"సరే, మీరు చెప్పి చూడండి. కాని దానివల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.'' అంటూ భాను బయటకు వచ్చేసింది.

* * *

ఆ రెండో రోజు సుబ్బయ్య బాలుకి నచ్చజెప్పాడు. భాను నిర్ణయం కూడా తెలిపాడు. ఆమె తెగతెంపులు చేసుకునే నిశ్చయానికి వచ్చిందని తెలుసుకున్న బాలు స్తబ్ధుడైనాడు. భాను చిన్న విషయాన్ని ఆధారంగా తీసుకుని అంత పెద్ద నిర్ణయం తీసుకుంటుందని అతను కలలోనైనా ఊహించ లేదు.

ఆ రోజు ఆఫీసులో కూడా అతను అన్యమనస్కుడిగా వున్నాడు. ఏ పనీ చేయడానికి మనసొప్పలేదు. ఆ మధ్యాహ్నం యింటికి వచ్చిన బాలు తిన్నగా ఆమె వద్దకు వెళ్ళారు. ఆమె కుట్టుమిషను మీద పిల్లల బట్టలు కుట్టుకుంటోంది.


జేబులోంచి పర్సు తీసి ఆమెకి అందిస్తూ, "ఐ యామ్ సారీ భానూ....ఆ రోజు నేనన్న మాటల్ని నువ్వు అపార్థం చేసుకున్నావా?....అది నా పొరపాటని గ్రహించాను ...ఈ రోజే ఓవర్‌టైమ్ బిల్లు అందింది....ఐదు వందల రూపాయలు ....ఏమైనా కొనుక్కోవాలంటే కొనుక్కో !''

భాను మౌనంగా ఉండిపోయింది. కాని లోలోన ఆమె అహంకారంపై పన్నీరు చిలికినట్లయింది. ఎలాగైతేనేం, అతనికి బుద్ధి చెప్పగలిగింది. మొదటిసారిగా బాలు ఆమె ముందు తల దించుకున్నందుకు ఆమె సంతోష పడింది.

కొద్ది క్షణాలు తదేకంగా బాలు ఆమెని చూసి మౌనంగా బయటకు వెళ్ళిపోయాడు.


LPC


ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్



# జెట్ పంపులు

రెండు స్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనోబ్లాకు, జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును. $\frac{3}{4}$ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.



LOW MAINTENANCE
HIGH CAPACITY
SIMPLE TO INSTALL

వివరములకు

Grams : "NAIDUBROS" Phone : Office : 24997 Works : 22757

**THE EL-P-EM INDUSTRIALS**

393, Mettupalaym Road, (P.B. No. 1053) COIMBATORE-641 002.

SALES BRANCHES :-

112, Zeera, Secunderabad - 3.

13/85, Jayachamarajendra Road, Bangalore - 2.

10, Municipal Market Building, Kokkalai, Trichur-1.

రాత్రి పదిన్నర దాటింది. కాని బాలు యింకా ఆఫీసు నించి యింటికి రాలేదు. భాను హృదయం అప్రయత్నం గానే అతని గురించి ఆలోచించ సాగింది. 'బాలు యింత వరకూ ఎక్కడుండి పోయాడు? ఇలా జరగడం యిదే మొదటిసారి. బాలు ఎన్నడూ యింత రాత్రిదాకా బయట వుండలేదు. ఎప్పుడైనా అత్యావసర పరిస్థితి ఎదురైతే ముందుగానే తెలిపే వాడు.

పాప, జానీ ఎప్పుడో పడుకున్నారు.

భాను అతని రాకకై ఆత్రంగా నిరీక్షిస్తూ పత్రిక పేజీలు తిరగేస్తోంది.

అకస్మాత్తుగా తలుపు గొళ్ళెం శబ్దమయింది -

"అమ్మాయీ....!"

ఆ స్వరం ప్లీడర్ సుబ్బయ్యది! భాను వెళ్ళి తలుపు తీసింది.

"కొంప మునిగిందమ్మా ...బాలుని పోలీసులు ఎరెస్టు చేశారు!" ఆయన లోపలికి వస్తూ అన్నాడు.

"ఎరెస్టా....ఎందుకు?...." భానుపై పిడుగు పడి నట్లయింది.

"ఏం చెప్పనమ్మా....అతనికి మతి పోయినట్లుంది.... ఆఫీసు కేష్ దొంగతనం చేసే అవుసరమేం వచ్చిందతనికి?"

"దొంగతనమా?" భాను గజగజ వణికిపోయింది.

'అవును, అతను అంతగా దిగజారి పోవడానికి కారణం తనే నేమో? తన కోరిక తీర్చడానికే అతనిలా చేసి ఉంటాడు.

ఆమెలో దాగివున్న అహంకారం మంచులా కరిగి పోయింది....హృదయం ముక్కలు ముక్కలైంది. వెర్రి అవేశంలో తను తీసుకున్న నిర్ణయాన్ని బట్టే అతనలా తప్పటడుగు వేశాడు!

"నువ్వు బాధ పడకమ్మా....నేను మెజిస్ట్రేట్‌గారి వద్దకు వెళుతున్నాను. జామీనిచ్చి అతణ్ణి విడిపిస్తాను." సుబ్బయ్య సానుభూతిగా అన్నాడు.

"భాను గదిలోకి వెళ్ళి ఆ రోజు బాలు ఆమెకిచ్చిన అయిదు వందలు తీసుకువచ్చి సుబ్బయ్య చేతిలో పెట్టింది. "బాబాయీ....ఈ అయిదు వందలు తీసుకు వెళ్ళండి. నా పొరపాటు నేను గ్రహించుకున్నాను. ఆయన్ని ఎలాగైనా తీసుకు రండి. ఇక ఆయన్ని ఎన్నడూ కష్టబెట్టను. హద్దు మీరిన కోరికలతో ఆయన్ని ఎన్నడూ వేధించను. వెర్రి ఆవేశానికి గురవ్వను."

"అది సరే గాని, డబ్బు వుంచమ్మా... నేను చూసుకుంటాను కదా!" అంటూ సుబ్బయ్య వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిన రెండు గంటలకి బాలు తిరిగి వచ్చాడు.

అతను లోపలికి రాగానే భాను అతణ్ణి లతలా చుట్టేసి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఎందుకలా బాధ పడతావు భానూ....కన్నీరు తుడుచుకో! కొన్ని తప్పులు నీ వల్ల జరిగాయి....కొన్ని పొరపాట్లు నా వల్ల జరిగాయి....ఇక ముందు మనం మన సమస్యలని ప్రేమగా పరిష్కరించుకుందాం....అవును కదా మై స్వీట్ డియర్?"

బాలు ఆమె కన్నీరు తుడిచి, డైనింగ్ టేబిలు వైపు దారి తీశాడు.

ఆ రెండో రోజు అమెను హృదయానికి హత్తుకుని ప్రేమగా నవ్వుతూ బాలు ఆఫీసుకి బయలుదేరాడు.

దార్లో ప్లీడరు సుబ్బయ్య అతని కెదురయ్యాడు, "ఏమోయ్ బాలూ అమ్మాయి విడాకుల భూతం దిగిందా లేదా?"

"నిజంగా మీరు గొప్ప ప్లీడరే ...మీ ఐడియా గొప్పగా పని చేసింది. థాంక్స్!"

బాలు నవ్వుతూ ముందుకి కదిలాడు.

R. K. S. KNITTINGS TIRUPUR

Regd. No. 342215

మా ప్రత్యేక తయారింపులు::

* 100% ఫైన్ * పాయల్ ఫైన్
* జిప్పీ ఫైన్ * మైసన్ ఫైన్
* రాకెట్ ఇంటర్ లాక్ * 100% పాయల్ కలర్ వెస్ట్స్
* 100% రిబ్ బ్రీవ్స్ * ట్రంక్స్ * మమతా ఫైన్

Phone: 22016

R. K. S. Knittings

43, Cauvery St, TIRUPUR - 638 602